# భారీ పౌరులు!

'అమెరికా ఇండియాల మధ్య పెద్ద యుద్ధం వచ్చిందనుకోండి. మిమ్మల్ని అమెరికా ప్రభుత్వం, అమెరికా తరఫున ఇండియా మీద యుద్ధం చేయమంటుంది. చేస్తారా?' సూటిగా అడిగాడు అతను.

ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా 'చేయను. చేయనుగాక చేయను' అని జవాబిచ్చాడు ఇతను.

అతను చిరునవ్వి, కరచాలనం చేసి, నుంచుని 'ధన్యవాదాలు' అన్నాడు.

ఇక్కడ ఆ ప్రశ్న అడిగిన 'అతను' అమెరికన్ ఇమ్మిగ్రేషన్ అండ్ నేచ్యురలైజేషన్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్.

జవాబు చెప్పిన 'ఇతను' అమెరికా పౌరసత్వం కోసం ఇంటర్వ్యూకి వచ్చిన శ్రీనివాస్.

ఇంటర్వ్యూ ఫలితం - శ్రీనివాస్‌కి అమెరికా పౌరసత్వం నిరాకరించబడింది.

0 0 0

అసలు అమెరికా పౌరసత్వం మిగతా దేశీయులకి ఎలా లభిస్తుంది? దానివల్ల లాభాలేమిటి? నష్టాలేమిటి? అని కొంతమంది పాఠకులకి అనుమానం వచ్చి, 'ఎన్నారై కబుర్లలో వ్రాయరూ' అని నాకు ఈమెయిల్సు పంపించారు. ఇది వారి కోసమే కాక, వివరంగా విషయం తెలుసుకోవాలనుకుంటున్న వాళ్ళందరి కోసం వ్రాస్తున్న వ్యాసం.

0 0 0

మొదటి ప్రశ్న, అసలు అమెరికా పౌరసత్వం మిగతా దేశీయులకి ఎలా లభిస్తుంది? అని.

అంతులేని కథలో, మిగతా కబుర్లలోనూ ఇది చెప్పుకున్నాం. స్టూడెంట్ వీసా మీద వచ్చే వాళ్ళు చదువులు పూర్తయాక, ప్రాక్టికల్ ట్రైనింగ్ కూడా పూర్తి చేసుకుని, అదృష్టం కలిసొచ్చి ఎవరైనా ఉద్యోగం ఇచ్చే వాళ్ళుంటే, హెచ్‌వన్ వీసా తెచ్చుకుని దానిమీద పనిచేస్తారు. అంటే ఉద్యోగం చేయాలంటే, ఇక్కడి ఏదో ఒక కంపెనీ హెచ్‌వన్ వీసాకి స్పాన్సర్ చేయాలన్నమాట.

అలాగే ఇండియానించీ, మిగతా దేశాలనించీ రకరకాల ఉద్యోగాలు చేయటానికి అమెరికా వచ్చినవాళ్ళు హెచ్‌వన్ వీసా మీద పనిచేస్తూనే, గ్రీన్ కార్డ్‌కి అప్లయ్ చేస్తారు. గ్రీన్‌కార్డ్ అనేది వాడుక పదమే కానీ, దాని అసలు పేరు ఏలియన్ రెసిడెంట్

కార్డ్. ఇలాటి వాళ్ళని లాఫుల్ పర్మెనెంట్ రెసిడెంట్స్ (ఎల్.పి.ఆర్) అంటారు. గ్రీన్‌కార్డ్ వచ్చాక ఐదేళ్ళు ఇక్కడ నివసిస్తే, అమెరికా పౌరసత్వానికి అర్హులవుతారు.

చెప్పటానికీ వినటానికీ వినాయక చవితి కథలాగా వినసొంపుగా వుంటుంది కానీ, అడుగడుగునా ఎన్నో రూల్సూ, పద్ధతులూ, లాయర్లూ, ఖర్చులూ, నిస్పృహలూ, నిరాశలూ, ఆశాభంగాలూ ఎన్నో మనల్ని అంటిపెట్టుకునే వుంటాయి. కాకపోతే ముందు హెచ్‌వన్ వీసా, తర్వాత గ్రీన్‌కార్డ్, తర్వాత పౌరసత్వం కావాలని గట్టి పట్టు పట్టి, విడవని విక్రమార్కులు మంచి మార్కులతో అవన్నీ సాధించు కుంటారు.

అవును బాబూ, మీరు చెప్పింది మహత్తరంగా వుంది కానీ, ఎందుకీ లేనిపోని బాధ?

'మన భారతదేశం కొన్ని బాధాకరమైన దేశాల్లా కాదే, పారిపోయి ఇంకో దేశానికి వలస పోవటానికి? కొన్ని కమ్యూనిష్టు దేశాలనించీ, సంవత్సరంలో పన్నెండు నెలలూ కరువూ వరదలున్న దేశాలనించీ, రాజకీయంగా అలజడిగా వున్న దేశాల నించీ జనం పారిపోతుంటే అర్థం వుందేమోగానీ, మనకెందుకీ దురద?' అనేది కోటి రూపాయల ప్రశ్న కాదు కాదు... ఈ రోజుల్లో మిలియన్ డాలర్ల ప్రశ్న.

దీనికి సమాధానం ఒకటి కాదు. చాలా వున్నాయి. మనిషి మనిషికీ ఒక చరిత్ర. ఒక కారణం. అది తోడటం చర్విత చర్వణమే! ఎవరి ఇంట్లో పిల్లల్ని కావాలని విదేశాలకి పంపించారో, ఎవరైతే అలా వెళ్ళారో వాళ్ళని అడిగితే, తలా ఒక కొత్త కథ చెబుతారు. చెప్పిన కథ చెప్పుకోకుండా, కంచికి పోకుండా ఎన్నైనా చెప్పుకోవచ్చు! కాకపోతే ఈ వ్యాసం అమెరికా పౌరసత్వం గురించి కాబట్టి అదెలా వస్తుందో, అది రాకపోతే నష్టాలేమిటో చూద్దాం.

0 0 0

మన దేశంనించీ అమెరికా వలస వచ్చేవాళ్ళల్లో నూటికి 99 శాతం అమెరికాలోనే వుండిపోతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. ప్రతివాళ్ళూ పంచవర్ష ప్రణాళికతోనే అమెరికా వస్తారు కానీ, ఆ వర్షాలు ఎక్కువయి తడిసిపోయి, బట్టలు ఆరబెట్టుకుంటూ అమెరికాలో శాశ్వతంగా (ఏది శాశ్వతం చెప్పండి) వుండిపోతారు. మరి అలాటప్పుడు మంచో చెడో పెంచుకుంటున్న దేశంలోని అవకాశాల్ని అందు కోవటంలో దురాశ ఏమీ లేదు.

కొంతమంది, రాజకీయాల్లో సెనెటర్లుగానూ, గవర్నర్లుగానూ వుండాలంటే పౌరసత్వం అవసరం. ఎక్కువగా విదేశాల్లో ప్రయాణం అవసరమైన ఉద్యోగాల్లో వుంటే కూడా అంతే. ఎందుకంటే అమెరికన్ పాస్‌పోర్ట్ మీద ఇండియా చైనాలాటి బహు కొద్ది దేశాలకి తప్ప, వీసా ముందుగా తీసుకోవలసిన అవసరం లేదు. కెనడా, జపాన్, యూరప్... ఏ దేశాలయినా, ఎయిర్‌పోర్ట్‌లో పాస్‌పోర్ట్ మీద ఓ ముద్ర వేయించుకుని రెండు నిమిషాల్లో దర్జాగా బయటికి వెళ్ళిపోవచ్చు. అదీకాక అమెరికన్ ఇమ్మిగ్రేషన్ రూల్సు ఎప్పుడూ మారుతూనే వున్నాయి. ఇంకా క్లిష్టతరమవుతున్నాయి. ఆగినందు వల్ల ఆగడాలే కానీ, ఆనందం లేదు. పొరపాటున ఏదన్నా క్రిమినల్

కేసులో ఇరుక్కుంటే, జైల్లో పెట్టి, శిక్ష పూర్తవగానే, సరాసరి ఇండియన్ ఎంబెసీకి తీసుకువెళ్ళి, డెపోర్టేషన్ (అప్పగింతలు) చేస్తారు. మళ్ళీ అమెరికాలో అడుగు పెట్టకుండా అడుగడుగునా జాగ్రత్తలు తీసుకుంటారు.

ఇప్పుడు ఒక అమెరికా పౌరుడు తన తమ్ముడినో చెల్లెలినో విదేశాలనించీ అమెరికా రావాలని స్పాన్సర్ చేస్తే, దశాబ్దాలు పడుతుంది. అదే ఒక గ్రీన్‌కార్డ్ ఆయన వాళ్ళని అమెరికాకి తేవాలంటే, శతాబ్దాలు పట్టక పోయినా దాదాపుగా అంతే అవుతున్నది.

కాకపోతే అమెరికాలో పుట్టే పిల్లలు, తల్లీదండ్రీ పొరుగుదేశం వారయినా సరే అమెరికా పౌరులయిపోతారు!

అలాగే తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు అమెరికా పౌరులయితే, వారి పిల్లలు బయటి దేశాల్లో పుట్టినా పిల్లలకి అమెరికా పౌరసత్వం ఇస్తారు. మిలటరీలో అమెరికా తరఫున కనీసం ఒక్క సంవత్సరం యుద్ధం చేస్తే పౌరసత్వం ఇచ్చేస్తారు. అలాగే అమెరికన్ సిటిజన్ని విదేశీ పౌరులు పెళ్ళి చేసుకుంటే, గ్రీన్‌కార్డ్ త్వరగానే వస్తుంది. తర్వాత మూడేళ్ళల్లోనే పౌరసత్వం కూడా ఇచ్చేస్తారు.

మరి గ్రీన్‌కార్డ్ మీద ఐదేళ్ళు వున్నవాళ్ళు, సిటిజెన్ అయేటప్పుడు ఇంకా కొన్ని 'కోరికలు' తీర్చాలి.

ఒకటి వున్న ఐదేళ్ళూ రాముడు బుద్ధిమంతుడులాగా వుండాలి. బయటి దేశాలకి వెళ్ళినా, ఒక్క సంవత్సరం లోపలే వెనక్కి రాకపోతే, ఐదేళ్ళ పరిమితి పూర్తిచేసినట్టు కాదు. అమెరికా దేశ చరిత్ర తెలిసి వుండాలి. ఒక పరీక్ష కూడా పెడతారు, దేశచరిత్ర మీదా, ప్రస్తుత పరిస్థితుల మీదా. అది పాసవకపోతే పౌరసత్వం ఇవ్వరు.

అలాగే ఇంగ్లీషు మాట్లాడటం, వ్రాయటం రావాలి. దీని మీదా ఒక పరీక్ష పెడతారు. మా తారగారి తల్లి తాయారమ్మగారు, ఇంగ్లీషులో ఒక్క ముక్కా రానందువల్లే అమెరికా పౌరసత్వం సంపాదించలేక పోయారు.

ఒక కుటుంబమంతా గ్రీన్‌కార్డ్ మీదే వున్న ఒక కుటుంబరావుగారి పిల్లల్లో పెద్దవాడు స్కూల్లో అనవసరంగా పెద్ద పోట్లాటలో ఇరుక్కుని, ఇండియాకి పంపించ బడ్డాడు. అది చిన్న విషయమే అయితే, మళ్ళీ రానిస్తారు. కానీ ఏ ఐదేళ్ళో, పదేళ్ళో ఆగితేనేగానీ రానీయరు. అప్పుడు ఆ కుటుంబం విచ్ఛిన్నం అవదూ!

ఇటువంటి కష్టాలూ, నష్టాలూ చాల వున్నాయి!

పంచవర్ష ప్రణాళిక మీద వచ్చేటప్పుడు, ఇవన్నీ ఎవరూ ఆలోచించరు.

కానీ నీళ్ళల్లో దూకితేనే కదా లోతు తెలిసేది.

అదీకాక దూకిన తర్వాత, మునగకుండా చూసుకోవలసిన బాధ్యత కూడా వుంది కదూ!

O O O